


# దీపాలవేళ దాటాకా వెళ్లిపోయింది



రాజోలు అవతలున్న నగరంనించి ఈ మధ్యే పసలపూడి మకాం వచ్చిన దూదేకే గౌసుజాన్ భార్య ముఖం చాలా బాగుంటది. నీలం రంగు గాజుకళ్ళు, జిగ్‌జిగేల్మని మెర్సిపోతుంటాయి, కడిపిలంక గులాబీ పువ్వురంగు శరీరం, పొడుగాటి నడుం, బక్క పల్చగా ఉండే ఆ మనిషిని ఎవరితోనూ పోల్చగూడదండి. అలాంటి అందాన్ని ఇంకెక్కడా చూసెరగం మనం. మనిషి గురించయ్యింది మరి మనసు గురించి చెప్పాలంటే రాగి కలపని మేలిం బంగారం. ఇక ఎదటివాళ్ళకి ఒక పనిచేస్తానని మాటిచ్చిందంటే ఇంకంతే. గాలి దుమారమొచ్చి పచ్చటి తోటల్ని నేలకొరగేసినా, వరదగోదారొచ్చి వూర్ని ముంచేసినా, నూరు ఆరైనా, ఆరు నూరైనా అన్నమాటకి నిలబడిపోయుంటుంది. అన్నపని అన్నటైముకి చేసి తీరుతుంది. అంత నికార్సి మనిషి. అసలు పేరు షబీనా అయితే వూరోళ్ళంతా బూబమ్మ అని మార్చేసేరు.

పొద్దుట్నుంచీ ఒకటే ముసురు. దాంతో దీపాలవేళ ఎప్పుడైందో తెలీటం లేదు. రాములోరిగుడి అరుగుమీద తోకభామిరెడ్డిగారు భారతం చదువుతుంటే కర్రోరికిష్ణుడితో పాటు ముప్పైమందిదాకా వింటున్నారు.



కిళ్ళీకొట్టు పట్టాభిరామయ్యకి మధ్యాన్నం నించే పులపరంగా ఉంటే కొట్టుకట్టేసి ఇంటి కెళ్ళిపోయేడు. దాన్ని జేర్చున్న గోపాలరావు కాఫీ హొటేల్లో వెలుగుతున్న పెట్రోమాక్సు లైట్లో కిర్సనాలయి పోవస్తే పోసి గాలికొడ్తన్నాడు వాళ్ళబ్బాయి శ్రీను. రోడ్డుకి ఆ పక్కనున్న మున్సబురెడ్డి కిళ్ళీకొట్టులో దీపం మట్టుకి వెలిగిపోతుంది. బ్రాకెట్టాడేవాళ్ళు వర్షాన్ని పట్టించుకోకుండా రాత్రి బెజవాడ్నుంచి రాబోయే నెంబరు తెల్సుకోడం కోసం అద్దె సైకిళ్ళేసుకుని అర్జంటుగా వెళ్ళిపోతున్నారు రామచంద్రపురం.

చింతా కుసుమ హరినాధరెడ్డిగారమ్మాయి ప్రభావతి ఉన్నపళాన రమ్మని కబురు చేస్తే ఆ చీకట్లోనే ఆ వర్షంలోనే ఆళ్ళలోగిట్లో కెళితే ఎదురొచ్చిన హరినాధరెడ్డి భార్య చంద్రావతి ఎందుకొచ్చేవంది.

చెప్పింది బూబమ్మ.



''ఇందాకే మాసారం అత్తోరింటి కెళ్ళింది. అయినా మా ఉద్దారకుడితో పొద్దున్ననగా కబురెడితే ఇప్పుడు దిగడ్డావేంటి?'' అందావిడ.

''నాకిప్పుడే అందిందండి కబురు''.

''మరి కొత్తబట్టలన్నీ చింతా అప్పయ్యమామ్మగారి అరుగుమీద మిషనుకుట్టు లక్ష్మణరావుకి పంపేసిందే...'' అనేసేకా ఏదో గుర్తొచ్చి ''మా ప్రభావతి పెళ్ళికి కొన్న పట్టు చీరలు రెండిస్తాను. ఆటితో మా మనవరాళ్ళకి గౌన్లు కుడతావా?'' అంది చంద్రావతిగారు.

అలాగేనంది బూబమ్మ.

పాతకాలం సెంట్ల కలగలుపు వాసనొచ్చే బర్మాటేకుబీరువాలోంచి పట్టుచీరలూ, శిల్కు చీరలూ తీసిన చంద్రావతి బూబమ్మ ముందు కుప్పలాగ పడేసేక వాళ్ళిద్దరి మనవరాళ్ళ ఆదిగౌన్లుకూడా ఇచ్చింది.

వాటన్నిటినీ శిల్కుగుడ్డలో మూట గట్టుకుంటున్న బూబమ్మతో ''ఎప్పుడు కుట్టు కొస్తావేంటి?'' అంది చంద్రావతి.

''ఎల్లుండి దీపాలెట్టకముందే పట్టుకొచ్చేస్తానండీ'' అన్న బూబమ్మకి ''ఇదిగో బజాణా'' అని డబ్బులిస్తే వద్దంది.

''పర్లేదు తీసుకో'' అంటే ''ఎప్పుడూ అలవాటులేదండీ... ఎందుకంటే నండీ భజాణా తీసుకున్నాకా రాత్రికి రాత్రి నాకేవన్నా అయ్యినే పోతే... మీ పనాగిపోతే...'' అని నవ్వేస్తా వెళ్ళిపోయింది బూబమ్మ.

* * *

అన్నమాట ప్రకారం ఆవేళ సాయంత్రం దీపాలు పెట్టడానికి ముందే పట్టుకెళ్ళిన చీరల్ని చంద్రావతి ఇద్దరు కూతుళ్ళకీ రకరకాల మోడలు గౌన్ల కిందా రెండు మెత్తని బొంతల కిందా కుట్టి పట్టుకొచ్చిన బూబమ్మ పనితనం చూసి ఆ గాలిమేడలో మనుషులంతా తెగ మెచ్చుకున్నారు. ఆ గౌన్లన్నీ తిరగేసి మరగేసి మరీ చూసి వాళ్ళ పిల్లలకి తొడిగేసి ''రాంపురంలో యీదలరఘురామయ్య కొట్లో రడీమేడ్డు బట్టలకన్నా బ్రెహ్మాండం గా ఉన్నాయి'' అని తెగ మెచ్చేసుకున్న చంద్రావతి కుట్టుకూలితో పాటు రెండు తాపేశ్వరం కాజాలూ, నిన్న శనివారం ఉపవాసం అని కాల్చుకున్న తాటిరొట్టి ముక్కా, మొన్న బిక్కవోలు సుబ్బారాయుడు షష్టిలో కొన్న జీళ్ళలో పుంజీడు మిగిల్తే అయ్యా పెట్టింది.

చాలా సంబరపడిపోతా ఇంకా ఆ గౌన్లనీ బొంతల్నీ చూసుకుంటున్న చంద్రావతిగారు ''ఇదిగో బూబమ్మా రేపు చల్దిపొద్దేళ దాటేకా రా చెల్లూరెళ్ళే దార్లో ఉన్న మా పొలంలో బెల్లం వండుతున్నారు. ఓ పదలం తూగే అచ్చు పట్టుకెళ్ళుగాని'' అంది. గోగన్నమఠంలో ఉండే చంద్రావతిగారి రెండో అమ్మాయి రామకుమారి వాళ్ళాయనగారు వాడిపడేసిన పంట్లాలూ బుష్కోట్లు బూబమ్మ కిచ్చి ''మా పాలేరోడి పిల్లలకి సైజు చెయ్యి బూబమ్మా'' అంది.

పట్టుకెళ్ళిన మర్నాడే చిన్న చిన్న నిక్కర్లు కిందా, బుష్షర్టులు కిందా కుట్టు కొచ్చేసింది బూబమ్మ. ఆటిని చూసిన కుమారి వాళ్ళ పాలేళ్ళ పిల్లల కివ్వకుండా వాళ్ళ పిల్లలు ఇంట్లో తొడుక్కోడానికి వాడుకోడం మొదలెట్టింది.

కాలవ దగ్గర అప్పారావుగారి ఆఖరోడు అబ్బులు పెద్దాపురం శిలుకుగుడ్డ ఇచ్చి ''లాల్చీ కుట్టాలి బూబమ్మా ఇదిగో ఆదిలాల్చీ'' అనిచ్చేడు.

వాటినందుకున్న బూబమ్మ ''ఎప్పుడిక్కావాలి అబ్బులుగారూ?'' అంది.

''ఎల్లుండు మార్టేరు వెళ్తన్నాను. రేపురాత్రికిచ్చేస్తావా?''.

''తంచనుగా ఇస్తాను''.

మర్నాడు రాత్రి లాల్చీ సంగతి మర్చిపోయిన అబ్బులు రాత్రుళ్ళు సీక్రెటుగా ఎళ్ళొస్తున్న తూరుప్పేటలో ఉండే రంగమ్మ ఇంట్లోకి దూరేడు.

కుట్టిన లాల్చీ పట్టుకుని సరాసరి అక్కడికొచ్చేసిన బూబమ్మ ''ఇదిగోండి అబ్బులుగారూ'' అనేసరికి గబుక్కున మంచం మీంచి

లేచిపోయిన అబ్బులు, రంగమ్మ గదిలో తలో మూలకీ వెళ్ళి సిగ్గుపడతా ఒంటిమీద బట్టలు సర్దుకున్నారు.

వెలంపేటలో కొన్నిళ్ళ జనాలకి దీపావళి పండక్కి బట్టలిస్తానని మాటిచ్చి రాత్రీ పగలనక పనిచేసి అన్నటైముకి బట్టలిచ్చేసి టైఫాయిడొచ్చి పడిపోయింది.

కొన్నాళ్ళకి పంచాయితీ ఆఫీసు అరుగుమీద తీర్పులిచ్చే పెద్దలు ''ఊరి మొత్తం మీద మాట మీద అలా నిలబడే మనిషిఆ బూబమ్మ ఒక్కర్తే. మన వంతా ఆ బుల్లిని జూసి నేర్చుకోవాలి'' అనేసేరు.

* * *

నెలల కొడుకు కాసిమ్ అంటే పంచ ప్రాణాలు బూబమ్మకి. వాడికి ఏదన్నా అయితే తుఫానప్పుడు లేతాకులా అల్లాడిపోద్ది మనిషి. రాత్రీ పగలనక వాడిమంచం దగ్గరే కాపలా. ఆ మధ్య చెవిపోటు వస్తే నిమ్మరసం, గవ్వపొడుం పొంగించి చెవిలో పోసింది. అయినా తగ్గలేదు. రుద్రజడాకు పసరు పిండుతా వస్తే వారానికి తగ్గింది. అదయిన నెలరోజులకి గజ్జ దగ్గర పెద్ద సెగ్గడ్డలేస్తే చంద్రకాంతం చెట్టు ఆకుల్ని ఆముదంలో మరిగించి రాసింది. ఆ గెడ్డ మానేకా రెండు నెలలు బాగానే ఉన్నాడు ఇదిగో ఇప్పుడీ కోరింత దగ్గు పట్టుకుంది. ఈ దగ్గు మందుల కంటే రాజేశ్వరస్వామి గుడెనకాల మాలక్షమ్మగారి మంత్రం మా గొప్పగా పని చేస్తదని అంతా అంటే అక్కడికి తీసుకెళ్ళింది బిడ్డని.

మంత్రమేసిన మాలక్షమ్మగారు ''ఓ వారం పాటు రోజా తీసుకురా పిల్లాడ్ని అని లోపల కెళ్ళి బూడిదరంగుశాలువా ఒకటి తెచ్చి దీనికి బెజ్జాలు చాలా పడ్డాయి ఏం చేస్తావో మరి కొత్తదాన్లాగా చేసివ్వాలి'' అంది.

ఆ శాలువా అందుకుని చూసింది బూబమ్మ. అంచుల మీద చాలా చోట్ల పురుగులు కొట్టేసినియ్యి. ''దీన్ని మిషను మీద గాకుండా డార్నింగు చెయ్యాలండి. అదెలాగ చేస్తారంటేనండీ. ఈ శాలువా లోపల దారప్పోగుల్నే లాగి సూదిలో గుచ్చి నాజూగ్గా చేతికుట్టు పని చెయ్యాలండి...'' అంది.

''అలాగే కానియ్యి'' అని పది రూపాయిలు బజాణా ఇవ్వబోతే తీసుకోలేదు.

''బజాణా మట్టుకి ఎప్పుడూ తీసుకోనండి... పుట్టేకా ఎప్పుడూ పుచ్చుకో లేదండి...ఆయ్'' అంటా చెలాగ్గా నవ్వేసిన బూబమ్మ భజాణా డబ్బులు పుచ్చుకోపోడానికి నాలుగైదు కారణాలు చెప్పి చివర్లో ''ఇంకో ముక్కండి ముందే మీరు డబ్బులిచ్చేస్తే ఇంక మీ పనిచేద్దావని నాకెందుకనిపిస్తదండి అమ్మగారూ?'' అనేసింది.

దాంతో అంతసేపూ తెల్లగన్నేరు పువ్వులా నవ్వుతా మాటాడిన మాలక్షమ్మగారి ముఖం చెక్కేసిన కందగెడ్డలాగయిపోవడం చూసింది బూబమ్మ. ఇలాగ పెడసరంగా మాటాడ్తే కోరింతదగ్గుతో ఊపిరాడక గిలగిల్లాడి పోతున్న కాసిమ్‌కి మంత్ర మెయ్యను పొమ్మంటే ఆడేమయిపోతాడు. ఆడికేవన్నా జరిగితే తన ప్రాణంలో ప్రాణమయిన బిడ్డ బంగారంలాంటి బిడ్డకేవన్నా అయితే??? అయ్యబాబోయ్ ఇంకేవన్నా ఉందా గుండెలు జారిపోవూ, ప్రేణాలు అక్కడికక్కడే పోవూ, వద్దొద్దు అనుకుంటా ఆ మాలక్షమ్మగారి దగ్గర కెళ్ళి బజాణా పుచ్చేసుకుని శాలువా పలానారోజు పట్టుకొచ్చి ఇస్తానని చెప్పి వెనక్కొచ్చేసింది.

* * *

భుజం మీదున్న జంతర్ని మోసుకుంటా బిక్కవోలు అవతలున్న నల్లమిల్లి వెళ్ళేడు గౌసుజాన్. సరిగ్గా అప్పుడే ఇక్కడ కడుపులో నెప్పి రావడం మొదలైంది బూబమ్మకి. అది ఇరవై నాలుగ్గంటలనెప్పి (ఎపెంటిసైటిస్) అని తెలీదా మనిషికి.

అక్కడ పని చూసుకునేసరికి దీపాలు పెట్టేరు. నల్లమిల్లి నించి బిక్కవోలు వంతెన దగ్గరకొచ్చిన గౌసు తొసిపూడి జంక్షను వేపెళ్ళే క్వారీ లారీ ఏదన్నా దొరుకుద్దేమో అని అక్కడున్నోళ్ళని అడుగుతుంటే అది దొరకాలంటే బలభద్రపురం వంతెన దగ్గరకెళ్ళి నిలబడు అన్నారాళ్ళు. ఏం చెయ్యాలో తెలీక జబ్బకి జంతరు తగిలించుకుని నడక మొదలెట్టేడు.

ఇక్కడ మొగుడికోసం ఎదురుచూస్తున్న బూబమ్మ గిలగిలా కొట్టుకుంటుంది. అటు పక్క చంటికుర్రోడుకాసిమ్ ఏడుస్తున్నాడు.

నడుస్తా బలభద్రపురంవేపెళ్తున్న గౌసుని నక్కలోడు (దొంగ) కత్తి చూపించి అటకాయించేడు.

బయట వర్షం చూస్తే విసిరిసిరి కొడ్తంది. గాలి విపరీతంగా దూరంగా పిడుగు పడిన శబ్దం తర్వాత మెరుపులు. ఒక పక్క బాధపడతానే మొగుడికోసం వెర్రి చూపులు చూస్తుంది బూబమ్మ.

రోడ్డుకి ఆ దిగువలో వేసుకున్న పాకలో ఉంటన్న నక్కలోడి పెళ్ళాం అప్పుడే ప్రసవించిందంట ఆడికి డబ్బులు కావాలంట. ఓ పక్క కత్తితో దబాయిస్తానే బతిమాల్తున్నాడు. సంపాయించిందంతా ఇచ్చేసి బలభద్రపురం వంతెన మీద కొచ్చేసరికి పసలపూడి సైడెళ్ళే ఎర్రకంకర లారీ కనబడింది. వాళ్ళని బతిమలాడి అందులో ఎక్కి కోడి కూసే వేళకి ఇంటి కొచ్చేసరికి నెలలబిడ్డ కాసింగాడు ప్రాణాలు వదిలిన భార్య బూబమ్మ శవంమీద ఆదమరిచి నిద్రోతున్నాడు.

* * *

మర్నాడు బూబమ్మ శవాన్ని ఈఁంద్రపేట మలుపులో ఉన్న తురకల గోరీల మధ్య పాతిపెట్టి ఇంటికొచ్చిన గౌసుకి ఆ మనిషిలేని ఇల్లు బోసి పోయి కనిపించింది.

పగలంతా ఎలాగో భరించేడుగానీ రాత్రయ్యేసరికి ఇక తట్టుకోలేక తాగేసేడు. అలా తాగేసేకా మంచం మీదికి దేకేడు.

అక్కడ్నించి రోజూ అలాగే చేస్తున్నాడు. ద్రాక్షారామంలో వుండే బంధువులొచ్చి పరామర్శించి వెళ్తా ''ఈడికో దారి జూడాలి'' అనుకున్నారు. ఆ రోజు కూడా రాత్రయ్యింది. అప్పటికే బాగా తాగేసి పడుకున్నాడు గౌసుజాన్. గబుక్కున మెలుకువరాడంతో లేచి చూస్తే

కాసిమ్ ఆనందంగా కేరింతలు కొడ్తున్నాడు. తెల్లబట్టల్లో వాడి పక్కనే ఉన్న బూబమ్మ జిగేల్మనే కళ్ళతో బిడ్డనే చూసుకుంటా జాకెట్టు బొత్తాలిప్పి రొమ్ము కాసిమ్ బుల్లినోట్లోకుక్కి పాలిస్తుంది.

ఆ మనిషినలా చూసిన గౌసు గొంతెండిపోయింది. ఊపిరాగిపోయింది. గజగజా హడలిపోతా నల్లబిన్నీ దుప్పటి ముసుగేసుకునుండిపోయేడు.

అర్ధరాత్రయ్యింది.

భయపడిపోతున్న గౌసు మీద ముక్కువాసనొస్తున్న దుప్పట్ని కొంచెం జరిపి చూస్తే పిల్లోడ్ని చూసుకుంటా ఇంకా అలాగే ఉంది బూబమ్మ. ఉచ్చతో తడిసిపోయింది ఆకివీడునవారు మంచం. కళ్ళు గట్టిగా మూసుకున్న గౌసు ''చలో..చలో... ఇదర్ సే ఛలో..మమ్మల్ని పట్టుకోకు'' అనరిచేడు దుప్పట్లోపల్నుంచి.

వాడు జంతర్ పట్టుకుని ఏకేటప్పుడు ఎగిరిన దూదిపింజం లాగ నవ్విన బూబమ్మ.. ''నిన్నేం చెయ్యను లేవయ్యా..రేపు అమావాస... దీపాలేళ దాటిం తర్వాత మా సెల్లి నర్సారెడ్డిగారి పొలంపక్క గట్టుమీద అదేనయ్యా ముచ్చుమిల్లి కాలవ గట్టు మీదున్న చింతచెట్టు కిందకి రమ్మనవా... ఇదిగో నిన్నే'' అంది.

''అస్మా ఎవరూ?'' అన్నాడు గౌస్.

''అబద్ధాలాడకు ఆడపిల్లలు పుడతారు. దాక్షారామంలో ఆగావారి వీధిలో ఉండే మీ మావయ్యకూతురు అస్మాని నువ్వు నికా చేసుకోబోతున్న బోగట్టా నాకూ అందింది...నేను రమ్మంటుంది ఆ పిల్లనే..అదే మా చెల్లిని'' అంది బూబమ్మ.

పెళ్ళాం అలా మాటాడ్తుంటే ముందు కొంచెం కంగారు పడ్డా తర్వాత సర్దుకున్నాడు గౌసు. తను చేసుకోబోయే మేనమావ కూతురు అస్మా చాలా గుండె నిబ్బరం గల మనిషి. ఒకపక్క వర్షం వస్తున్నా గోనెసంచి సగానికి లోపలికి తోసి నెత్తిమీదేసుకుని చచ్చిపోయిన బూబమ్మ చెప్పిన వేళకి ఆ ముచ్చిమిల్లి గట్టు మీదున్న చింత చెట్టు పక్కకి నడుస్తుంది.

అప్పుడే దీపాలవేళ దాటింది. వాళ్ళింటి ముందు పెంచుకుంటున్న గిన్నికోడి తప్పిపోతే దాన్ని వెతికడానికెళ్ళిన లస్కరు సోమేశ్వర్రావు, గంటాగళాసు కొండబాబూ దానికోసం వెతికి వెతికి దొరక్క పోయేసరికి వెనక్కి మళ్ళేరు. లాకుల్లో వదిలిన పాసింజరు పడవ నెమ్మదిగా వస్తుంటే దాన్ని నడిపే ఎడ్ల శీనుకి ఎదురొచ్చిన ఇసుక పడవ ఓనరు కోటిలింగాలు ఏదో మాట్లాడ్తున్నాడు. షికారు కెళ్ళిన భోగం భాస్కరమ్మా క్రిష్ణవేణీ వెనక్కి నడిచొస్తున్నారు. సందకల్లు తీసిన త్రిమూర్తులు నడుంకున్న బెల్టుకి కట్టుకున్న కుండతో పాటు నడుస్తున్నాడు. గవళ్ళబ్బులు కాలవలో నీళ్ళు తోడే లిస్టరింజను రిపేరు చేస్తున్నాడు, దారికడ్డంగా తడిమసూళ్ళు చేస్తున్న రైతులు ఇళ్ళకి బయల్దేల్లేరు.

చింతచెట్టు దగ్గరకొచ్చి ఆగింది అస్మా. జివ్వు జివ్వు మంటా వీస్తున్న గోదారి కాలవ గాలితో పాటు లావైన చింతచెట్టు వెనకనించి వచ్చిన బూబమ్మని చూసింది. నీలంరంగు బూబమ్మగాజుకళ్ళ నిండా నీళ్ళు.

అంతసేపూ గుండెల్ని అరచేత్తో పట్టుకు నిలబడ్డ అస్మాకి బూబమ్మనలాగ చూసేసరికి ఏడుపొచ్చేసింది.

బాగా దగ్గరకొచ్చి చెంపలూ తలా నిమిరిన బూబమ్మ ''బాగున్నావా చెల్లీ?'' అంది.

బానే ఉన్నానన్నట్టు తలూపింది అస్మా.

''కాసిమ్ ఎలాగున్నాడమ్మా?''

''నిన్న జబ్బమీద పొక్కు లొచ్చినియ్యి చిన్నయ్యేలే''

''మాచపత్రిఆకు పసరురాయమ్మా''

''అలాగే అక్కా''

''ఆ రోగిష్టి పిల్లోడ్ని, ఆ అరిపేదోడ్ని నీ బిడ్డలా చూసుకోమ్మా ఆడు నా ఆరోప్రేణం తల్లీ, నాయమ్మా''అని కాస్సేపు ఆగేకా ''ఒక ముఖ్యమైన విషయం నీకు చెప్పాలి చెల్లీ...ఎప్పుడూ లేందీ మంత్రాలేసే బేమ్మర్ల మాలక్షమ్మగారి దగ్గర శాలువా రిపేరుకి పదిరూపాయిలు బజాణా పుచ్చుకున్నాను. ఈలోగా నన్ను అల్లా పిల్చేసేడు. ఆళ్ళకిస్తానన్న ఆఖరిరోజు రేపే చెల్లీ... రేపు దీపాలెట్టేలోగా ఆ శాలువా రాంపురంలో బాగు చేయించి నువ్వు ఇచ్చెయ్యమ్మా. ఇన్నాళ్ళూ ఇచ్చిన మాట మీద బతికేను. ఇప్పుడు తేడా రాకూడదు సుమా'' అంది బూబమ్మ.

''అలాగేఅక్కా, తప్పకండా చేస్తాను'' అనేసి అరచేతిలో చెయ్యేసిన అస్మా అన్నమాట ప్రకారం ఆ మర్నాడు దీపాలవేళ దాటేకా శాలువా రిపేరు చేయించి మాలక్షమ్మగారి కిచ్చేయడంతో, ఏడుస్తా వూరి చివరి పొలాల మధ్యలోంచి మంచుపొగల్లోకెళ్ళిపోయింది బూబమ్మ.

అంతే, ఆ తర్వాత ఇంకెప్పుడూ పసలపూడి చుట్టుపక్కల కనపడలేదా సాయిబుల మనిషి బూబమ్మ.

* * *